విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 25, సెప్టెంబర్ 2025

వర్షాలకు కూలిన మట్టి మిద్దె

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండలంలోని యాదవాడ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి బీసీ కాలనీలో నివాసముంటున్న మంగలి శేఖర్ మట్టి మిద్దె మంగళవారం తెల్లవారు జామున కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. మిద్దె కూలడంతో నిత్యవసర వస్తువు లన్నీ మట్టిలో కూరుకొని పోయాయి. ఉన్న ఇల్లు కూలడంతో తల్లి తన 9 సంవత్సరాల కుమార్తెను తీసుకొని కట్టుబట్టలతో పక్కనే ఉన్న రాముని దేవాలయంలో తలదాచుకున్నారు. బుధవారం వీఆర్వో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. భర్త అనారోగ్యంతో నంద్యాల ఆసుపత్రిలో ఉన్నారని, మిద్దె కూలడంతో తాము రోడ్డున పడ్డామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆశా కార్యకర్తలకు సంబంధించిన జీవోను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కుళ్లాయి స్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు వారి అధ్యక్షతన ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 19సంవత్సరాల క్రితం ఎలాంటి విద్యార్హత వయసుతో సంబంధం లేకుండా నియమించబడ్డ ఆశాలు బాలింతలకు నవజాత శిశువులకు మహిళలకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. సంవత్సరాలుగా వైద్య సేవలందిస్తున్న వారికి వేతనాల పెంపుగాని సెలవులు గాని ఉద్యోగ భద్రత ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యంగాని కార్మికులుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుర్తించలేదన్నారు. రోజు రోజుకు పని భారం పెరిగిందన్నారు. వీరికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని రిటైర్మెంట్ వయసు 62కు పెంచాలని 180రోజులు మెటర్నటీ సెలవులు గ్రాడ్యూటీ రూ.1,50,000 ప్రభుత్వం ప్రకటించిందని దానికి సంబంధించిన జీవోలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆశా కార్యకర్తలకు అన్ని సాధారణ మెడికల్ సెలవులతో పాటు నాణ్యమైన యూనిఫామ్ డిఎం అండ్ హెచ్ఓ సంతకం చేసిన గుర్తింపు కార్డులు ఇప్పుడున్న ఈ యాప్లను అప్లోడ్ చేయడానికి 5జి సిమ్ కార్డులు ఇవ్వాలని ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్త డ్యూటీలో మరణిస్తే ఎక్స్ గ్రేసియా రూ.10లక్షల రూపాయలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం దహన ఖర్చులకు రూ.20వేలు, ప్రమాద బీమా రూ.10లక్షలకు ఉచిత గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి వడ్డే మహేష్,చంటి నంద్యాల జిల్లా ఆశా వర్కర్ల కోశాధికారి లక్ష్మీదేవి, ప్రమీల, శోభ,రంగమ్మ, బయమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రఘంటాలంకారంలో శ్రీశైల భ్రమరాంబ

విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైల మహా క్షేత్రంలో దసరా మహోత్సవాలలో భాగంగా మూడో రోజు అయిన బుధవారం నాడు ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజలు విశేష కుంకుమార్చనలు నవవర్తనార్చనలు జపాను అనుష్టానాలు పారాయణలు సూర్య నమస్కారాలు చండీ హెూమం పంచాక్షరి బ్రామ్మరి బాల అనుష్టానాలు చండీపారాయణం చతుర్వేద పారాయణలో కుమారి పూజలు విశేషంగా జరిపించబడ్డాయి. స్వామివారికి రుద్ర హెూమం రుద్ర యాగంగా జపములు సాయంకాలం ప్రత్యేక పూజలు రాత్రి తొమ్మిది గంటలకు కాళరాత్రి పూజ అమ్మవారి ఆస్థాన సేవ సుహాసిని పూజలు అర్చక స్వాములు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. చంద్ర ఘంటా అలంకారం - రావణ వాహన సేవ: దసరా ఉత్సవాలలో భాగంగా మూడోరోజు శ్రీ భ్రమరాంబ దేవి అమ్మవారు చంద్ర గంట అలంకారంలో శివపార్వతులు రావణ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంకాల పూజలు అనంతరం అమ్మవారిని చంద్ర ఘంటాలంకారంలో శివపార్వతుల రావణ వాహనంపై వేంచింపజేయించి నూతన వస్త్రాలతో పలు రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరింపజేయించి స్వామి అమ్మవార్లకు మహా మంగళహారతులు ఇచ్చి వేద పండితుల వేద మంత్రోచ్చారనాల నడుమ ఉత్సవ మూర్తులను గ్రామోత్సవానికి తోడుకొని వచ్చారు. ఈ గ్రామోత్సవంలో స్వామి అమ్మవార్లను చూసి భక్తులు ఆధ్యాత్మిక భావనకు లోనైనారు. గ్రామోత్సవంలో భక్తులు స్వామి అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు అడుగడుగున కర్పూర హారతులతో నారికేలములు సమర్పించి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ విశేష కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు ఆలయ అర్చక వేద పండితులు ,ఆలయ అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూతన నయారా ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

విశాలాంధ్ర-పాణ్యం : పాణ్యం మండల కేంద్రంలో గల జాతీయ రహదారి ప్రక్కన నూతనంగా నయారా కంపెనీకి చెందిన అవ్వారు సరస్వతి ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రముఖ న్యాయవాది,టిడిపి రాష్ట్ర కార్యదర్శి,స్టేట్ మార్క్ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి బుధవారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక ఆధునీకరణ టెక్నాలజీతో ఈ ఫిల్లింగ్ స్టేషన్ నిర్మించడం జరిగిందని, వాహనదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిల్లింగ్ స్టేషన్ యజమాని గౌరీనాథ్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వాహనదారులకు ఇబ్బందులకు గురి చేయకుండా, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, నయారా ఫిల్లింగ్ స్టేషన్లో సేవలను అందించడం జరుగుతుందన్నారు. స్టేట్ మార్క్ఫెడ్ డైరెక్టర్,న్యాయవాది తులసి రెడ్డిని శాలువా పూలమాలతో ఫిల్లింగ్ స్టేషన్ యజమాని గౌరీనాథ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అవ్వారు గౌతమ్,టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి వహీద్ హుస్సేన్,టిడిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, చాంద్ బాషా, నయారా రాయలసీమ జోన్ డెవలప్మెంట్ ఏరియా మేనేజర్ రాజేష్,జిల్లా సేల్స్ మేనేజర్ మోహన్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంచార్జీ ఎంపీడీవోగా తాహీర్‌హుసేన్

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా డిప్యూటీ ఎంపీడీవో తాహీర్‌హుసేన్ బాధ్యతలు బుధవారం చేపట్టారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న కార్యాలయ పరిపాలన అధికారి రాజేంద్ర ప్రసాద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు చేపట్టిన తాహీర్‌హుసేన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఈఓ తారకేశ్వరి, ఎంసీఓ రాజ్‌కుమార్,పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అలంకరణతో అమ్మవారు

విశాలాంధ్ర-కోవెలకుంట్ల : దసరా ఉత్సవాల్లో దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి రుద్రాభిషేకము కల్ప పూజ, పసుపుతో కుంకుమార్చన పూజా కార్యక్రమాలు జరపగా సాయంత్రం అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయనికి చేరుకుని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ సుబ్రమణ్యం, సతీమణి విజయలక్ష్మి,ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆర్యవైశ్య యువజన సంఘం ప్రెసిడెంట్ కర్నాటి అభిలాష్ సంఘ సభ్యులు మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

సర్వేయర్ ఆత్మహత్యాయత్నం పరామర్శించిన తహసీల్దార్

విశాలాంధ్ర- రుద్రవరం : మండల పరిధిలోని పేరూరు గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న సరస్వతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలుసుకున్న తహసీల్దారు ఆల్ఫ్రెడ్ బుధవారం పరామర్శించారు. నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో వైద్య చికిత్సను చేయించుకుంటున్న సర్వేయర్ సరస్వతి ఆరోగ్య పరిస్థితిని వైద్యాధికారులను, ఆమె కుటుంబ సభ్యులను వైద్యశాలకు వెళ్లి అడిగి తెలుసుకోవడం జరిగిందని తహసిల్దారు తెలిపారు. అధైర్య పడవద్దని ఆందోళన చెందాల్సిన పని లేదని అన్ని విధాల తమ సహాయ సహకారాలు అందిస్తామని ధైర్యంగా ఉండాలని ఆయన సరస్వతికి భరోసా నివ్వడం జరిగిందని తెలిపారు.

జాతీయస్థాయికి జిల్లా క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రతిభ కనిపించిన క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యమని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ షేక్షావలి రెడ్డి పేర్కొన్నారు. గత నెల 28 నుంచి 30వరకు ప్రకాశం జిల్లా చేవూరులో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడలలో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచి సీనియర్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు దేవానంద్, సుభాష్, సబ్ జూనియర్ విభాగంలో ధర్మతేజ జాతీయ స్థాయి బాల్ బ్యాట్మింటన్ క్రీడలకు ఎంపికైనట్లు షేక్షావలి రెడ్డి తెలిపారు. ఈనెల 26 నుంచి 30వరకు తమిళనాడు డిండిగల్‌లో జరగబోయే జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులను అభినందించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

కోవెలకుంట్ల పోలీసుల అదుపులో మధ్యప్రదేశ్ ముఠా
సినీ పక్కిలో దోపిడీకి పాల్పడడం వీరి నైజం
వీరికి అడ్డు వస్తే ఖతమే

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : సినీ పక్కి లో దోపిడీలకు పాల్పడుతూ, పోలీసులను ముప్పతిప్పలు పెడుతున్న మధ్య ప్రదేశ్‌కు చెందిన అంతరాష్ట్ర దోపిడి దొంగల ముఠాను ఎట్టికెలకు పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠాలోని ఐదు గురు మహిళలు, ఒక పురుషుడు నీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వీరు కర్ణాటక, ఒరిస్సా, తెలంగాణ ,రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు,గోరంట్ల, వంటి పదిచోట్ల చోరీలకు పాల్పడిన కేసులు వీరిపై నమోదయ్యాయి. కోవెలకుంట్ల పట్టణంలో వినాయక చవితి పండుగ అనంతరం రెండో రోజు మాయలూరు ఉయ్యాలవాడ మండలం తుడమల దీన్నే గ్రామానికి చెందిన రామకృష్ణ కోయిలకుంట్ల పట్టణానికి వచ్చి స్టేట్ బ్యాంకులో బంగారు నగలు కుదువకు పెట్టి రెండు లక్షల నగదు తీసుకొని తన బైక్ సైడ్ బ్యాగ్‌లో రెండు లక్షలు ఉంచుకొని తీసుకెళ్తుండగా ట్రాఫిక్ లో నిల్చున్న రామకృష్ణ బైకు నుండి ఈ ముఠా రెండు లక్షల నగదు దొంగలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వీరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అనంతపురం జిల్లా గోరంట్లకు చెందిన పోలీసులు ఈ ముఠాను అరెస్టు చేసి ఈ ముఠాను కటకటాల వెనక్కి నెట్టారు మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఇటీవల కోవెలకుంట్ల పట్టణంలో జరిగిన చోరీ కేసులో కోయిలకుంట్ల పోలీసులు మధ్యప్రదేశ్ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకొనేందుకు కోర్టులో పిటి వారెంట్ దాఖలు చేశారు. దీంతో కోర్టు అనుమతితో ఈ ముఠాను అదుపులోకి తీసుకొని కోవెలకుంట్లలో జరిగిన చోరీ కేసులో వీరిని అరెస్టు చేసి ఆళ్లగడ్డ కోర్టులో హాజరు పరిచారు. దీంట్లో న్యాయమూర్తి వీరిని రిమాండ్‌కు ఆదేశించారు. దీంతో వీరిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు. గోరంట్ల పోలీసులు మీరు నుండి లక్ష ఇరవై వేలు రికవరీ చేసినట్లు ఎస్సై మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. ఈ ముఠా అరాచకాలను మరిన్ని వెలికి తీసేందుకు కస్టడీకి తీసుకొని విచారించేందుకు కోర్టు అనుమతి కోసం పిటీషన్ వేయనున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు.

చిత్రలేఖనం కళాకారులను ఆధరించాలి

లైవ్ పెయింటింగ్‌లో లావణ్య అద్భుత ప్రతిభ
అభినందించి, పారితోషికం అందజేసిన
మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె : చిత్రలేఖనం కళాకారులను ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం భువనగిరికి చెందిన నామోజు లావణ్య లైవ్ పెయింటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరుస్తోంది. లావణ్య తండ్రి ఆర్టిస్టుగా జీవనం సాగించేవారు. తండ్రిని స్ఫూర్తిగా తీసుకున్న లావణ్య చిన్ననాటి నుండి చిత్రలేఖనంపై ఎంతో ఆసక్తితో అద్భుతమైన చిత్రాలు గీస్తూ వచ్చింది. మన సంస్కృతి సాంప్రదాయాలను, పుణ్యక్షేత్రాలలోని ఆధ్యాత్మి కతను, ప్రకృతిలోని అందాలను చిత్ర రూపంలో తెలియ జేయాలనే సంకల్పంతో పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ లైవ్ పెయింటింగ్ వేస్తూ అందరిని ఆకట్టుకుంటుంది. అందులో భాగంగా బనగానపల్లె మండలంలోని ప్రముఖశైవ క్షేత్రమైన యాగంటికి వచ్చిన లావణ్య క్షేత్ర పరిధిలో సహజ సిద్ధంగా ఏర్పడిన ఎర్రమల కొండలు, ఆలయ గోపురం, కోనేరు, ఉమామహేశ్వర స్వామి వార్ల మూలవిరాట్, బసవేశ్వర స్వామి వారు ఒకే చిత్రంలో కనిపించేలా కేవలం నాలుగు గంటల్లో లైవ్ పెయింటింగ్ వేసి అందరిని అబ్బురపరిచింది. లావణ్య లోని అద్భుత ప్రతిభను గుర్తించిన మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి కార్యాలయంలో బుధవారం నాడు మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి లావణ్యను ప్రత్యేకంగా సన్మానించి, పారితోషికం అందించి అభినందించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ లావణ్య పలు పర్యాటక ప్రాంతాలతో పాటు పుణ్యక్షేత్రాలలో పర్యటించి ఇప్పటివరకు 100కు పైగా లైవ్ పెయింటింగ్ వేయడం అభినందించదగ్గ విషయ మన్నారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ బెడుదల మహేశ్వర్ రెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బండి మౌలిశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

విశాలాంధ్ర - మిడుతూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నంద్యాల జిల్లా డి ఎం హెచ్ ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తలముడిపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమల ద్వారా విష జ్వరాలు తదితర రోగాల బారిన ప్రజలు పడే అవకాశం ఉందని, ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తంగా అందుబాటులో ఉండి ప్రజలకు సరైన వైద్యం చేయాలని సూచించారు. డ్రై డే సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి జ్వర సంబంధమైన సర్వేలను నిర్వహించాలని సూచించారు. హాస్పిటల్లో అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ చుట్టూ పరిసరాలను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మద్దిలేటి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి పీ4 శిక్షణ : ఎంపీడీవో

విశాలాంధ్ర - పాములపాడు : గ్రామాల్లోని పేదరిక నిర్మూలన కొరకే పి ఫోర్ పై సచివాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ భవనంలో పీ4పై సచివాలయ సిబ్బందికి రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ శిక్షణలో పేదరికానికి సంబంధించిన గృహాల గుర్తింపు,లబ్ధిదారుల ఎంపిక, డేటా ఎంట్రీ విధానాలు,సంక్షేమ పథకాల అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలను అధికారులచే వివరించారు. పీ4 సర్వే లక్ష్యం ప్రతి పేదరికంలో ఉన్న కుటుంబాన్ని గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు చేరేలా చేయడం అని తెలిపారు. పేదరిక నిర్మూలనలో ప్రతి సచివాలయ సిబ్బంది కృషి కీలకమని ఆయన గుర్తు చేశారు. అనంతరం శిక్షకులు సచివాలయ సిబ్బందికి శిక్షణను ఇచ్చారు. ఈ శిక్షణలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పెండింగ్లో ఉన్న డిఎలు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షులు డి.మౌలాలి డిమాండ్ చేశారు. బుధవారం ఎస్టీయూ నంద్యాల జిల్లా కార్యాలయం నందు జిల్లా అధ్యక్షుడు డి.మౌలాలి అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డి.మౌలాలి మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కూడా ప్రభుత్వాల బాధ్యతేనని, ఉద్యోగులకు న్యాయంగా రావలసిన ఆర్థికపరమైన బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకపోతే ఉద్యమ బాట తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్‌లకు రావలసిన డీఏలను వెంటనే విడుదల చేయాలని, పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటుచేసి 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయ ఇంచార్జ్ ఎల్ సుబ్బయ్య, జిల్లా సహాధ్యక్షులు నరసింహారావు, ఎస్టీయూ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, సంగయ్య, ఖాదర్ వలీ, విజయ్ కుమార్, మౌలాలి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ ఉపాధి హామీ పథకం ఏపీవోగా ప్రతాప్ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. బనగానపల్లె ఏపీవోగా పని చేస్తున్న ప్రతాప్‌ను ఉన్నతాధికారులు ఆళ్లగడ్డకు బదిలీ చేయగా ఇక్కడ ఏపీఓ గా పనిచేస్తున్న వెంకటరమణ బనగానపల్లెకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీవో ప్రతాప్ విలేకరులతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ మండలంలో ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వము 90 ఎకరాలలో పండ్ల తోటలను సాగు చేసేందుకు తమకు లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటివరకు 84 ఎకరాలలో నిమ్మ, బత్తాయి మామిడి, కొబ్బరి పంటలు సాగులో ఉన్నట్లు తెలిపారు. అలాగే కంపోస్టు ఫిట్స్ 1000 లక్ష్యంగా పెట్టుకున్నామని అందులో 90 ఫీట్స్ పూర్తి చేశామన్నారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో 8706 జాబ్ కార్డులు ఉన్నట్టు తెలిపారు.

పాము కాటుతో మృతి చెందిన మహిళ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన ఈడిగ రమాదేవి పాముకాటుకు గురై మృతి చెందడంతో ఆమె కుటుంబానికి అదే గ్రామానికి చెందిన ఎర్ర పాపన్న గారి సుబ్బరాయుడు రూ.70 వేల ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం మృతురాలి సోదరుడు హరీష్ గౌడుకు ఎర్ర పాపన్న గారి సుబ్బరాయుడు 70 వేలు అందజేశారు. ఈనెల 22వ తేదీన యనకండ్ల గ్రామానికి చెందిన ఈడిగ రమాదేవి మినుము పంటలో కలుపు తీయడానికి వెళ్లి పాముకాటు గురై మృతి చెందారు. ఆమె భర్త శేఖర్ గౌడ్ రెండు సంవత్సరాల క్రితం మృతి చెందారు. దీంతో మృతురాలి ఇద్దరు కుమారులు మనీష్ గౌడ్, హేమంత్ గౌడ్ అనాథలయ్యారు. వారిని ఆదుకునేందుకు యనకండ్ల గ్రామానికి చెందిన ఎర్ర పాపన్న గారి సుబ్బరాయుడు మానవతా దృక్పథంతో రూ.70 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంజీవ గౌడ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నంద్యాల అభివృద్ధిపై సీఎంతో మాజీ ఎమ్మెల్యే భేటీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర సచివాలయం నందు సీఎం నారా చంద్రబాబు నాయుడును బుధవారం నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నంద్యాల నియోజక వర్గంలో ఎదురవుతున్న సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతం, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశా లను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. నంద్యాలలో టీడీపీని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవ లసిన వ్యూహాత్మక చర్యలపై కూడా సమగ్రంగా చర్చించారు. భేటీ సందర్భంగా నంద్యాల ప్రజల అభివృద్ధే తన ప్రథమ కర్తవ్యమని భూమా బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల అంచనాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు జరుగేం దుకు సీఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో ఆర్జీఎం అధ్యాపకులు

విశాలాంధ్ర-పాణ్యం : ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో ఆర్జీఎం అధ్యాపకులు చోటు దక్కించుకున్నట్లు కళాశాల డైరెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ అమెరికాలోని ప్రముఖ స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ ప్రతిఏటా ప్రపంచంలోని శాస్త్రవేత్తల్లో రెండు శాతం మందిని అత్యంత ప్రతిభా శాస్త్రవేత్తలుగా గుర్తిస్తుందన్నారు ఇందులో భాగంగా స్టాన్ ఫోర్డ్ బుధవారం విడుదల చేసిన శాస్త్రవేత్తల జాబితాలో 2024 - 25 సంవత్సరానికి గాను ఆర్జీఎం కళాశాలకు చెందిన డాక్టర్ పి సుదర్శన్ రెడ్డి మెకానికల్ ఇంజనీరింగ్ ట్రాన్స్ఫర్ట్ విభాగంలో 966వ ర్యాంకు, డాక్టర్ పి.శ్రీదేవి మెకానికల్ ఇంజనీరింగ్ ట్రాన్స్ఫర్ట్ విభాగంలో 1062 వ ర్యాంకు, డాక్టర్ ఉపేంద్ర రజాక్ ఎనర్జీ విభాగంలో 2977వ ర్యాంక్, డాక్టర్ బి. జమలయ్య అప్లైడ్ ఫిజిక్స్ విభాగంలో 4138వ ర్యాంకు, డాక్టర్ కే. వెంకటకృష్ణ అప్లైడ్ ఫిజిక్స్ విభాగంలో 6376 ర్యాంకు సాధించారన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులను ఆర్జీఎం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం శాంతి రాముడు, డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, డీన్ రామిరెడ్డి అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత : ఎంపీడీవో

విశాలాంధ్ర - మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరులో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఇజ్రాయిల్ రాజుకు మంగళవారం రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూల్ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో దశరథ రామయ్య హాస్పిటల్ చేరుకొని చికిత్స నిమిత్తం ఖర్చులకోసం రూ.12000 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నాగమ్మ, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీల్లో విజేతను అభినందించిన ఫిరోజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర స్థాయి మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన శివను నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ టీడీపీ కార్యాలయం నందు అభినందించారు. సెప్టెంబర్ 21నపశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో నంద్యాల యువకుడు పి.శివ మెన్స్ ఫిజిక్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం గెలిచాడు. దాదాపు 200మంది పోటీదారుల మధ్య అతని క్రమశిక్షణ, ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. శివ విజయానికి వెనుక న్యూ బాడీ లైన్ జిమ్ కోచ్ షేక్ ఖాజా మొహిద్దిన్ కఠిన శిక్షణ, అంకితభావం ప్రధాన కారణమని అందరూ ప్రశంశించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నుంచి వచ్చిన యువకుడు రాష్ట్రస్థాయి వేదికపై మెరిసి, మన పట్టణానికి గర్వకారణంగా నిలిచాడన్నారు. ఈ విజయం యువతకు ప్రేరణ, క్రమశిక్షణతో సాధన చేస్తే ఏ లక్ష్యం అయినా చేరుకోవచ్చని స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 7వార్డు ఇంచార్జి సైలాబ్, బాడీ లైన్ జిమ్ కోచ్ షేక్ ఖాజా పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - రుద్రవరం : మండల పరిధిలోని పెద్ద కంబులూరు గ్రామానికి చెందిన అబ్దుల్లా 26 గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు మద్యానికి బానిసై మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు తాగి మృతి చెందడం జరిగిందని మృతుని తల్లి మహమ్మద్ బి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

బీజేపీ సత్తా చాటుతాం

విశాలాంధ్ర - నందికొట్కూరు : రాబోయే స్థానిక ఎన్నికలలో నందికొట్కూరులో బిజెపి సత్తా చాటుతామని బిజెపి బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని జిల్లా బిజెపి అధ్యక్షులు డా.అభిరుచి మధు పిలుపునిచ్చారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలో బిజెపి నూతన కార్యాలయం ప్రారంబోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు... ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమసుందర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆగస్త్య శివకృష్ణ యాదవ్, బిజెపి జాతీయ మహిళా మోర్చా సభ్యురాలు షేక్ మొమీన్ షబానా, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మానపాటి శ్రీనివాస గౌడ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి తీరని లోటు

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని గొడిగనూరు గ్రామ సర్పంచు,టీడీపీ సీనియర్ నాయకులు దేశంరెడ్డి (71) మృతి భూమా కుటుంబానికి, టీడీపీకి తీరనిలోటని ఆళ్ళగడ్డ నియోజకవర్గ తెలుగు యువత నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి తెలిపారు. మాజీ సర్పంచ్ దేశంరెడ్డి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన బుధవారం గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. గ్రామానికి, పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. టీడీపీనాయకులు మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి,ప్రసాదరెడ్డి, రామసుబ్బయ్య, దేవేంద్రనాథ్ రెడ్డి,శేఖర్ రెడ్డి,రామకృష్ణ,బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, గురువారం 25, సెప్టెంబర్ 2025

గడువులోపు అనుమతులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: పరిశ్రమల స్థాపనకు వీలుగా ఆయా శాఖలు నిర్దేశించిన గడువు లోపు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం మరిన్ని పరిశ్రమలను స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి ద్వారా తలసరి ఆదాయం, జీడిపి పెరుగుతుందన్నారు. ఉన్న పరిశ్రమలకు మనం శాఖా పరంగా అవసరమైన సహకారం అందించాలన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం మొదటి స్థానంలో ఉండాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశ్యమని తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులకు గడువులోపు అనుమతులను మంజూరు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌కు సంబంధించి 19, కర్మాగారాల విభాగానికి సంబంధించి 1, భూగర్భ జల శాఖకు సంబంధించి 1, ఏపీఎస్పీడీసీఎల్‌కి సంబంధించి 1, లీగల్ మెట్రాలజీకి సంబంధించి 57 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, వీటికి వేగవంతంగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ కు నీటిని సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు పరిశ్రమలలో బరువు యంత్రాలను తనిఖీ చేస్తున్నారా లేదా అని కలెక్టర్ లీగల్ మెట్రాలజీ అధికారిని ఆరా తీశారు. పరిశ్రమల శాఖ జీఎం అశోక్ కుమార్, పరిశ్రమల శాఖ డీడీ జవహర్ బాబు, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, నాబార్డ్ డిడిఎం సుబ్బారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కిషోర్ కుమార్ రెడ్డి, పాల్గొన్నారు.

పవర్‌గ్రిడ్ కంపెనీకి భూములు ఇవ్వం : రైతులు

విశాలాంధ్ర–ఆలూరు: మండలంలోని మనేకుర్తి గ్రామంలో పవర్ గ్రిడ్ కంపెనీకి సంబంధించి భూముల వ్యవహారంపై జాయింట్ కలెక్టర్ బుధవారం ఎంఆర్ఓ కార్యాలయంలో గ్రామ రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ, ముందుగా రైతుల అభిప్రాయాలను ధైర్యంగా చెప్పండని ఆమె తెలిపారు. రైతులు పవర్ గ్రిడ్ కంపెనీకి తమ భూములు ఇవ్వబోమని తేల్చి చెప్పారు. ఈ భూములు మా జీవనాధారమని, వాటిని అవి విక్రయించమని, లీజుకు సైతం ఇవ్వమని, ఎన్ని ఒత్తిడులు వచ్చినా తాము ఒప్పుకునేది లేదని రైతులు స్పష్టం చెప్పారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రైతుల అభిప్రాయాలను విన్న తర్వాత రైతుల అభిప్రాయాలు తమపై అధికారులకు తెలియ జేస్తామని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, డిప్యూటీ తాహసీల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ బసవన్న గౌడ్, రెవిన్యూ సిబ్బంది, మనేకుర్తి రైతులు పలువురు రైతు సంఘం నాయకులు, మండల అధికారులు, హాజరయ్యారు. అనంతరం ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు కె.భూపేష్ మాట్లాడుతూ మనేకుర్తి గ్రామంలో పవర్ గ్రిడ్ కొరకు రైతులు నుండి బలవంతపు భూసేకరణ నిలుపుదల చేయాలన్నారు. రైతులు సాగు చేసుకుంటున్న 192 ఎకరాల భూమిని స్వాధీన పరుచు కొనడం బాధాకరమన్నారు. ఆ భూములు కోల్పోతే గ్రామంలో ఉండడానికి అవకాశం ఉండదని, వెంటనే భూసేకరణ నిలిపివేయాలన్నారు. రైతులను భయభ్రాంతులకు అధికారులు గురిచేయడం సరైంది కాదన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తే రాబోవు రోజుల్లో కచ్చితంగా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తాలూకా కార్యదర్శి చాపల గోపాల్, ఏఐటీయూసీ తాలూకా ఉపాధ్యక్షులు శివ, పూల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే సేవా దృక్పథం అలవరచుకోవాలి

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మానవ సేవే మాధవ సేవ అని విద్యార్థులు చదువుతో పాటు, విద్యార్థి దశ నుండే సామాజిక భాధ్యత, సేవా దృక్పథం, సామాజిక చైతన్యం అలవరచుకోవడానికి భారత ప్రభుత్వం 1969 సంవత్సరంలో జాతీయ సేవా పథకంను కళాశాల స్థాయిలో ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. కళాశాల లెక్చరర్స్ విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, ఉల్లోజి రావు, చిన్న మల్లేశ్వరుడు, బాల శంకర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఏపీఎం సూర్యప్రకాష్ బదిలీ

విశాలాంధ్ర – హొళగుంద: మండల వెలుగు ఏపీఎం సూర్య ప్రకాష్ కోసిగి మండలానికి ఏపీఎంగా బదిలీ అయ్యారు. కోసిగి మండల ఏపీఎం సత్యమ్మ ఇక్కడకు బదిలీపై వచ్చారు. నూతన ఏపీఎం సత్యమ్మ పదవీ బాధ్యతలు చేపట్టి అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లారు. పొదుపు మహిళల బలోపేతంలో, మహిళల సాధికారత, మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడే రేగులర్ ఏపీఎం లేకపోతే ఎలా అని పొదుపు మహిళలు అన్నారు. ఇన్ని రోజులు వరకు రెగ్యులర్ అధికారి పని చేసినందుకు పొదుపుమహిళల కష్టాలు తీరాయన్నారు. మండలంలో 24 మంది విలేజ్ బుక్కు కీపర్లు పని చేస్తున్నారు.

వీధి వ్యాపారులకు లోక్ కళ్యాణ్ మేళాలు

విశాలాంధ్ర–గూడూరు: వీధి వ్యాపారుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ఈ నెల 26న గూడూరు మెప్మా కార్యాలయంలో లోక్ కళ్యాణ్ మేళ నిర్వహిస్తున్నట్లు నగర పంచాయితీ మేనేజర్ విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలతో నిర్వహించే లోక్ కళ్యాణ్ మేళాలో వీధి వ్యాపారుల నుండి దరఖాస్తులు స్వీకరించబడుతుందన్నారు. అర్హులైన వీధి వ్యాపారులు రుణాలు పొందే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కొత్తగా వీధి వ్యాపారాలు చేస్తున్న వారికి ప్రధానమంత్రి వీధి వ్యాపా రుల ఆత్మ నిర్బర్ పథకంలో చేర్పిస్తున్నట్లు తెలిపారు. లోక్ కళ్యాణ్ మేళాలో ఆయా బ్యాంక్ అధికారులు, ఐసీడీఎస్ అధికారులు, లేబర్ డిపార్ట్‌మెంట్ హెల్త్ డిపార్ట్‌మెంట్, ఫుడ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్, టౌన్ పెండింగ్ కమిటీ సభ్యులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ జిల్లా రథసారథిపై వీడని ఉత్కంఠ

- తిక్కారెడ్డినే కొనసాగిస్తారా?
- కొత్తవారికి అవకాశం ఇస్తారా?

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: టీడీపీ జిల్లా అధ్యక్ష స్థానంపై అధిష్టానం ఇంత వరకు నిర్ణయం తీసుకోకపోవడంతో నూతన జిల్లా అధ్యక్షుడు ఎవరు అన్నదానిపై తీవ్ర చర్చనడుస్తోంది. 2024 ఎన్నికల ముందు ప్రస్తుతం అధ్యక్షులుగా ఉన్న తిక్కారెడ్డిని అధ్యక్షులుగా టీడీపీ అధిష్టానం నియమించింది. తిక్కారెడ్డి మంత్రాలయం నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. 2019 ఎన్నికల్లో మంత్రాలయం నియోజకవర్గం నుండి బరిలో నిలిచి ఓటమి పాలైనప్పటికీ నియోజకవర్గంలో ఆయన విస్తృతంగా పర్యటనలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. 2024 ఎన్నికల ముందు రాజకీయ సమీకరణల్లో భాగంగా అధిష్టానం మంత్రాలయం వాల్మీకి సామాజిక వర్గానికి కేటాయించింది. అప్పటి వరకు ఇంచార్జీగా ఉన్న తిక్కారెడ్డిని టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షునిగా నియమించింది. ఎన్నికల్లో జిల్లాలో టీడీపీ ఘనవిజయం సాధించింది. కర్నూలు పార్లమెంట్‌తోపాటు కూటమి అభ్యర్థులు ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గాల్లో విజయఢంకా మోగించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్సీ లేదా కార్పొరేషన్ చైర్మన్ పదవి వస్తోందని తిక్కారెడ్డి ఆశించారు. కాని అధిష్టానం తిక్కారెడ్డికి ప్రస్తుతం ఎలాంటి పదవి ఇవ్వలేదు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా అధ్యక్షుల మార్పులో భాగంగా కర్నూలు పార్లమెంట్ అధ్యక్షున్ని కూడా మార్చాలని అధిష్టానం నిర్ణయించింది. ఇందుకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, హిందూపురం ఎంపీ పార్థసారథి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబులతో త్రిసభ్య కమిటీ నియమించింది. వారు జిల్లాలో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. జిల్లా అధ్యక్ష బరిలో ప్రస్తుత అధ్యక్షులు తిక్కారెడ్డి, కర్నూలు టీడీపీ నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షులు కేఈ జగదీష్‌గౌడ్‌లు రేసులో ఉన్నారు. అదిష్టానం ఎవరివైపు మొగ్గుచూపుతుందో, ఎవరిని నియమిస్తుందోనని కార్యకర్తలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. అధ్యక్ష సీటుకోసం ఎవరికి వారు తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. 2026 జనవరి నుండి స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడం వలన ఆ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధ్యక్షస్థానం ఎంపిక జరుగుతుందంటున్నారు. ఇప్పటికే టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌లు జిల్లాపై దృష్టిసారించినట్లు తెలిసింది. త్వరలోనే నూతన అధ్యక్షున్ని ప్రకటిస్తారని ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. అయితే ప్రస్తుతం అధ్యక్షునిగా ఉన్న తిక్కారెడ్డిని ఎవరు వ్యతిరేకించకపోవడం విశేషం.



దసరా పండుగను ఘనంగా నిర్వహించుకోవాలి

విశాలాంధ్ర – నందవరం: ప్రజలందరూ దసరా పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవరావు దేశాయ్ అన్నారు. బుధవారం దసరా పండుగను పురస్కరించుకొని దాదాపు 500 మందికి నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్ల నుండి దసరా ఉత్సవాలు దేశాయి కుటుంబాల ఆధ్వర్యంలో దసరా పండుగ జరుపుకుంటున్నారని, ప్రతి ఏటా ఓ కుటుంబం నిర్వహించడం పూర్వం నుండి వస్తున్న సంస్కృతి, సాంప్రదాయమన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి, ఆధ్యాత్మిక, నైతిక విలువలను పెంపొందించుకుంటూ సామాజిక సేవా గుణాన్ని అలవాటు చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చట్టరీత్య నేరం

విశాలాంధ్ర – ఆదోని రూరల్: పంట పొలాల్లో గంజాయి సాగు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి బివిజి. సుధాకర్ రైతులకు హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు ఎవరు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ పొలాల్లో గంజాయి పంట సాగు చేయరాదన్నారు. ఒకవేళ ఎవరైనా సాగు చేసినట్లయితే, నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్ చట్టం, సెక్షన్ 8 ప్రకారం గరిష్టంగా 20 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు. ప్రతి గ్రామ వ్యవసాయ సహాయకులు రైతు సోదరులకు గంజాయి సాగు చేయడం చట్టరీత్యా నేరమని, సాగు చేయడం వల్ల ఎదుర్కొనే పరిణామాల గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర – కర్నూలు సిటీ: ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పీఎల్ వరలక్ష్మి సూచించారు. కల్లూరు మండలంలోని లక్ష్మీపురం గ్రామములో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారిణి పీఎల్ వరలక్ష్మి పాల్గొన్నారు. ఆమె మాట్లా డుతూ ఖరీఫ్ లో అధిక వర్షాల కారణంగా నష్ట పోతున్న ఉల్లి రైతులు త్వరితగతిన పంట నమోదు చేయించుకోవాలని, ఉల్లి రైతు పంట పూర్తిగా కోత దశ వచ్చే వరకు పంట కోత చేయరాదని సూచించారు. డీఆర్సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏవో రంగా రెడ్డి, ఏడీఏ వర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డిలు పాల్గొన్నారు.

లైబ్రరీ ప్రారంభం

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆఫీస్ నందు నూతన లైబ్రరీని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మరియు అధ్యక్షులు, జి. కబర్ధి, కర్నూలు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రిలు ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ తరపున డాక్టర్ రామచంద్ర శ్రీనివాసులు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఆఫీసుకు లా బుక్స్‌ను డొనేట్ చేశారు. వీటిని బుధవారం జిల్లా జడ్జి, సెక్రటరీలు ఆవిష్కరించారు.

భారీ వర్షానికి కూలిన ఇండ్లు



విశాలాంధ్ర – హొళగుంద: మండలంలోని సులువాయిలో భారీ వర్షానికి లింగయత జ్యోతి అమ్మ ఇల్లు కూలిపోయింది. బాధితురాలు జ్యోతి అమ్మకు ఎవరు దిక్కు లేకపోవడంతో సొంత మట్టి ఇంటిలో నివాసం ఉంటుంది. వర్షానికి ఇల్లు కూలిపోవడంతో అద్దె ఇంటిలో ఉండటానికి ఆర్థిక స్తోమత లేకుండా పోయిందని గ్రామస్తులు బుధవారం తెలిపారు. ఒంటరి మహిళగా ఉన్న అధికారులు ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయలేదని వాపోయారు. బాధితురాలు జ్యోతమ్మకు కూలిన మట్టి ఇంటికి వెంటనే ఆర్థిక సహాయం చేయాలని అలాగే ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేయాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

విశాలాంధ్ర – హొళగుంద: ఎల్లార్తి సర్పంచ్ కురువ చామండేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛాంధ్ర నిషేధం చేయాలంటూ మండి నీటి వాల్ ట్యాంకులను ఎంపీడీఓ విజయలలిత పరిశీలించారు. ఎంపీడీఓ విజయలలిత మాట్లాడుతూ గ్రామం లో ఎక్కడ చెత్త పడకుండా క్లీన్ పెట్టుకోవాలి విజ్ఞప్తి చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్త తీసుకోవాలని కోరారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాక వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం లో పనిచేసే క్లాప్ మిత్రులకు శాలువా కప్పి పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్మె గిరి, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ షాపి సచివాలయం సిబ్బంది నాగవేణి, అంజలి, పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులు పడిగాపులు

విశాలాంధ్ర –గోనెగండ్ల: మండల కేంద్రంలో బుధవారం స్థానిక మన గ్రోమోర్ వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. గత మూడు రోజులు నుంచి వరుసగా వర్షాలు పడుతున్నాడంతో రైతులు ప్రస్తుతం ఉన్న పంటలకు పత్తి, వేరుశనగ, మిరప, వినుములు, మొక్కజొన్నకు, పంటలకు యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. యూరియాకోసం ఉదయం నుంచి రైతులు ఎదురుచూస్తున్నారు. మన గ్రోమోర్ సెంటర్ వాళ్లు రైతులకు ఎకరాకు ఒక బస్తా, రెండు ఎకరాలకు రెండు బస్తాలు, మూడు ఎకరాలకు మూడు బస్తాలు ఆ పైన ఎంత పొలం ఉన్నా మూడు బస్తాలు యూరియా ఇస్తున్నట్లు రైతులు తెలిపారు. నేడు రాబోయే రోజుల్లో రబీ పంటలకు యూరియా పుష్కలంగా అందించాలని ఉన్నతా అధికారులకు రైతులు కోరుతున్నారు.

ఎయిర్ టెల్ పేమెంట్ బ్యాంక్ అకౌంట్ ఉపయోగకరం: పీడీ పి.వెంకట

విశాలాంధ్ర – కర్నూలు: ఎయిర్ టెల్ పేమెంట్ బ్యాంక్ ఉపాధి కూలీలకు భరోసా అని డ్వామా పీడీ పి.వెంకట రమణయ్య తెలిపారు. బుధవారం ఇటీవలన విద్యుదాఘాతంతో మృతి చెందిన ఉపాధి కూలి నందవరం మండలం జోహరాపురం గ్రామానికి చెందిన అలుకూరు రామిరెడ్డి కుటుంబ సభ్యులకు ఎయిర్ టెల్ పేమెంట్స్ బ్యాంక్ సంస్థ ద్వారా లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పీడీ పి.వెంకట రమణయ్య మాట్లాడుతూ వలస ప్రభావిత ప్రాంతాల్లో ప్రతియేటా ఉపాధి పనులు కల్పిస్తున్నామని అన్నారు. కూలీలల భద్రత కోసం ప్రభుత్వం కల్పించే భీమాతో పాటు, ఎయిర్ టెల్ పేమెంట్ బ్యాంక్‌లో అకౌంట్ ఉంటే అదనంగా తక్షణ ప్రమాద భీమా లక్ష రూపాయలు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వేణు, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ కర్నూలు జిల్లా మేనేజర్ బి.వీరా రెడ్డి, కస్టమర్ రిలేషన్స్ మేనేజర్ షేక్ మహబూబ్ బాషా, ప్రమోటర్ రామచంద్రారెడ్డితో పాటు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పరిసరాల పరిశుభ్రతను పరిశీలించిన ఈవోఆర్డీ

విశాలాంధ్ర – పి.బెళగల్ : మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల గదులను సిబ్బంది పరిశుభ్రం చేయడాన్ని ఈవోఆర్డీ మహేశ్వరి పర్యటించి అక్కడ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. హాస్టల్ చుట్టుపక్కల ఉన్న చెత్తా చెదారాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీతోపాటు పంచాయతీ కార్యదర్శి తదితర సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను ఎంపిక చేసుకుని వారి ఉన్నతికి పాటుపడాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్లో ఏపీఎం ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన పీ4 అవగాహన సమావేశంలో ఎంపీడీవో రాణెమ్మ పాల్గొని మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గ్రామాల్లో దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను ఎంపిక చేసి, మార్గదర్శకుల ద్వారా ఆయా కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి మెరుగుపడేందుకు పాటుపడడమే పీ4 పథకం ముఖ్య ఉద్దేశమని ఆమె అన్నారు.

డ్రైనేజ్, సీసీ రోడ్లు లేక ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర – ఆదోని రూరల్: మండలంలోని నెట్టేకల్ గ్రామంలో డ్రైనేజ్ సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు గ్రామ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గ్రామ ప్రజలతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి మాదిరి ఎల్లప్ప, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తూరు గంగన్న మాట్లాడుతూ గ్రామంలో ఎటువైపు చూసినా రహదారుల్లో వర్షపు నీరు నిలుచుండి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. దోమల విజృంభనతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. విష జ్వరాలతో దాదాపు ఏడుగురు గ్రామంలో చనిపోయినట్లు తమ దృష్టికు గ్రామ ప్రజలు తీసుకురావడం జరిగిందన్నారు. సుదీర్ఘకాలం పాలించిన పాలకులు కూడా నెట్టేకల్ గ్రామ సమస్యలను విన్నవించిన ఎడచెవిన పిడిచెవిన పెట్టి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పి అధికారం చేజిక్కించుకున్న తర్వాత ఏ ఒక్క నాయకుడు డ్రైనేజీ రోడ్ల సమస్య పరిష్కరించలేదని గ్రామ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా కూటమి ఎమ్మెల్యే డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కరెంట్ ఈరన్న, రాముడు, మంది గిరి శేషప్ప, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విచారించే కొద్దీ వెలుగు చూస్తున్న అక్రమాలు

విశాలాంధ్ర – ఆలూరు: ఆలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ నరసమ్మ, సూపర్వైజర్, అంగన్వాడి వర్కర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై. కురవల్లి అంగన్వాడి వర్కర్ భువనేశ్వరి ఇచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై జిల్లా పీడీ విజయ బుధవారం విచారణ చేపట్టారు. అంగన్వాడీ వర్కర్ భువనేశ్వరిని సీడీపీఓ నరసమ్మ రూ.4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసిందని, ఇవ్వనందుకు వేధింపులకు గురి చేయడం వల్ల ఆస్పత్రి పాలు అయ్యాయన్నారు. సూపర్‌వైజర్లు, అంగన్వాడీ వర్కర్ ద్వారా ప్రాజెక్ట్ పరిధిలో కమిషన్లు, వర్కింటేజీలు వసులు చేస్తున్నారని చేసిన ఆరోపణలపై ఆధారాలు చూపించాలని కోరారు. జరిగిన సంఘటనపై సీడీపీవో విచారించారు. విచారణలో బాధితురాలు కుటుంబ సభ్యులు పీడీని కలసి సీడీపీవోపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని కోరారు. జరిగిన సంఘటనపై ఇరువురితో పాటు సిబ్బందిని ఆలూరు సెక్టార్ మీటింగ్‌లో ఉన్న మరి కొందరిని విచారించామని తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని పీడీ విలేకరులకు తెలిపారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర – కోడుమూరు: మోటార్ వెహికల్ చట్టం, నియమ, నిబంధనల ప్రకారం ఆటోలలో ఓవర్ లోడ్ ఎక్కించరాదని, నిబంధనలు అతిక్రమించిన ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు ఉంటాయని కర్నూలు మోటార్ వెహికల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ కె.రవీంద్ర కుమార్ రెడ్డి హెచ్చరించారు. గురువారం కోడుమూరులో కర్నూలు మోటార్ వెహికల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ కె.రవీంద్రకుమార్ రెడ్డి పట్టణంలోని ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన మోటార్ వెహికల్ యాక్ట్, రూల్స్ ప్రభుత్వ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ఫోన్ మాట్లాడటం,మద్యం సేవించి డ్రైవింగ్ వంటివి చేయరాదని ఆటో డ్రైవర్లకు సూచించారు. ఆటోల్లో ఓవర్ లోడ్ ప్రయాణికులను ఎక్కించి ప్రయాణించడం ద్వారా ఏవైనా ప్రమాదాలు జరిగితే తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు నాయక్, సుధాకర్ రెడ్డిలు, మోటార్ వెహికల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు గణేష్, బాబు, బాబు కిషోర్‌లు కోడుమూరు ప్రాంతంలో పర్యటించి, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

కర్నూలులో వస్త్రాలయ షాపింగ్ మాల్ ప్రారంభం

విశాలాంధ్ర – కర్నూలు సిటీ: కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన వస్త్రాలయ షాపింగ్ మాల్‌ను ప్రముఖ సినీతార నిధి అగర్వాల్, కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ లు ప్రారంభించారు. సినీతార నిధి అగర్వాల్ ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున వస్త్రాలయ షాపింగ్ మాల్‌కు తరలివచ్చారు. సుమారు 2 గంటల పాటు ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. సినీ తార నిధి అగర్వాల్ అభిమానులకు అభివాదం చేస్తూ ఉత్సాహపరిచారు. షాపింగ్ మాల్‌లో నిధి అగర్వాల్ చీరలను ప్రదర్శిస్తూ సందడి చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, సినీ తార నిధి అగర్వాల్, వస్త్రాలయ మాల్ నిర్వాహకులు గోపాల్ రెడ్డి, హరీష్ రెడ్డిలు పాల్గొన్నారు. బస్తిపాటి నాగరాజు, టీజీ వెంకటేశ్‌లు మాట్లాడుతూ పత్తికొండలోని జొన్నగిరి వద్ద త్వరలోనే రూ.200 కోట్లతో బంగారు వెలికితీత పరిశ్రమ రాబోతుందని, వీటితో పాటు ఓర్వకల్లు వద్ద ఏర్పాటవుతున్న డ్రోన్ల తయారీ పరిశ్రమ, సెమీకండక్టర్ పరిశ్రమలతో జిల్లా వాసులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. నిర్వాహకులు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ అపరిమితమైన కలెక్షన్, అద్భుతమైన మోడల్ అత్యంత అందుబాటు ధరలతో పట్టు శారీస్, ఫ్యాన్సీ శారీస్, డ్రెస్ మెటీరియల్స్, చుడీదార్స్, రెడీమేడ్స్, లెహంగాస్, లేటెస్ట్ వేర్, వెడ్డింగ్స్, పార్టీ వేర్స్, కుర్తిస్, ఉమెన్స్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్ అందుబాటులో ఉన్నాయన్నారు.

మురుగు నీటితో కంపు కొడుతున్న కె.పేట గ్రామం

- అభివృద్ధిలో 75 ఏళ్లు వెనక్కి
- మురుగు కాలువలు గురించి పట్టించుకోని సర్పంచ్
- మా సమస్య తీర్చే నాధుడే లేడా అంటున్న గ్రామస్తులు



విశాలాంధ్ర – నందవరం: స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల గడిచినా గ్రామాల రూపురేఖలు మాత్రం మారడం లేదు. జాతిపిత మహాత్మ గాంధీ గ్రామ అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న మాటలను గ్రామ పాలకులు మాత్రం పట్టించుకోకపోవడంతో నేటికీ ఆ గ్రామాలు అభివృద్ధి అంటే తెలియని పరిస్థితి నెలకొన్నాయి. కనకవీడు గ్రామం ప్రత్యేక పంచాయతీగా 2018లో కె.పేట పంచాయతీగా ఏర్పడి ఆరేళ్లు కావస్తున్నా అభివృద్ధి మాత్రం చెందడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రధాన రహదారిపై మురుగు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో 365 రోజులు ఆధారపడిన మురుగునీరు ఆగడంతో కంపు కంపు కొడుతున్నాయి. దీంతో గ్రామస్తులు రోగాల బారిన పడుతు న్నారు. ఆ ప్రధాన రహదారిలో కాకుండా గ్రామంలో ఏ సందు చూసిన కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో ఆ మురుగు నీరంతా ప్రధాన రహదారి పైకి ఆ మురుగునీరు కూడా పోవడానికి కాలువలు ఏర్పాటు చేయక లేకపోవడంతో రామప్ప లచ్చప్ప తాతల గుడి నుండి నాగలదిన్నెకు పోయే రోడ్డు చివరి వరకు దాదాపు 400 మీటర్లు మురుగునీరు నిలిచిపోవడంతో గ్రామం కంపు కంపు కొడుతోంది. రోడ్డుకి ఇరువైపులా మురుగు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతోనే ఇలా మురుగు నిరుస్తుందని, సర్పంచ్, పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తు న్నారు. గ్రామంలోని ఉన్న ఆర్ఎంపీల నలుగురు వద్దకు దాదా పు రోజుకు 50 మందికి పైగా విష జ్వరాలతో ప్రజలు వెళు న్నారంటే ఆ గ్రామ పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోంది. రెండు రోజ్లుల క్రిందట కూడా ఆ దారిలో నడుచుకుంటూ వెళ్లిన వృద్ధురాలు కిందపడి కాలు విరగడంతో ఆమె మంచానా పడింది. ఇంత అస్తవ్యస్తంగా ఉన్న గ్రామ అభివృద్ధికి కేంద్రం నుండి వచ్చిన నిధులు ఏమయ్యాయంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సర్పంచ్, గ్రామ అధికారులు స్పందించి మురుగునీరు పోయేందుకు ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని లేకపోతే గ్రామస్తులు అంత కలిసి భారీ ఎత్తున కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని గ్రామస్తులు వెంకటేష్, మేకల శివ, ఈరన్న, తిమ్మప్ప, నరసింహులు, బజారి, బెల్లం ఐరన్న, వీరేష్ అన్నారు.

రూ. కోటి ప్రతిపాదన పంపాం – కార్యదర్శి సోమశేఖర్: మురుగు కాలువ లేకపోవడంతోనే ప్రధాన రహదారిపై మురుగు నీరు నిలిచి లేకపోవడం వాస్తవమేనని మా పంచాయతీ కార్యదర్శి సోమశేఖర్ తెలిపారు. ఆ రహదారిని ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా రూ.కోటితో సీసీ రోడ్డు, డ్రైనేజ్ ఏర్పాటుకు ప్రతి పాదనలు పంపినామ, నిధులు వచ్చిన వెంటనే నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ఇంటికన్నంకు పాల్పడిన ఇద్దరు నిందితులు అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఇంటికి కన్నం వేసి దొంగ తనానికి పాల్పడిన ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు నాలుగవ పట్టణ సీఐ విక్రమ సింహ తెలిపారు. బుధవారం ఆయన పాత్రికేయుతో మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి నెల 19న నగర పరిధిలోని కల్లూరు లోని తెలుగు వీధిలో నివాసం ఉంటున్న కారు డ్రైవర్ గురుస్వామి వారు ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వారి ఇంటిలోనికి ప్రవేశించి బీరువాలో దాచుకున్న సుమారు 11 తులాల బంగారు ఆభరణాలను రూ.15 వేల నగదును ఎత్తుకు వెళ్ళినట్లు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు 4వ పట్టణ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. నాలుగో పట్టణ ఇన్స్పెక్టర్ విక్రమ సింహ, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ షాకీర్, కానిస్టేబుళ్లు ఎల్లా శివుడు, సుబ్బరాయుడులు ఒక ప్రత్యేక బృందంగా ఏర్పడి విచారణలో భాగంగా ఈ మధ్యకాలంలో జైల్ నుంచి రిలీజ్ అయినటువంటి నిందితుల వివరాలను సేకరించి వారిని సాంకేతిక పరిజ్ఞానంతో ఆరా తీస్తుండగా దొంగతనం జరిగిన టైంలో గుడివాడకి చెందిన జగదీశ్ కదలికలు ఉన్నట్టుగా గమనించడం జరిగిందన్నారు. మంగళవారం జగదీశ్, ఇతనికి సహకరించిన వ్యక్తి కర్నూలు వస్తున్నారన్న సమాచారంపై ఇద్దరినీ మిస్టర్. ఇడ్లీ హోటల్ వద్ద ముద్దాయిలు జగదీష్, ఎద్దుల కృపానందంను అదుపులోకి తీసుకొని విచారించిన వారినిపై కేసు ముద్దాయిలుగా నిర్ధారించుకొని అరెస్ట్ చెయ్యడం జరిగిందన్నారు. వారి నుండి 5 తులాల బంగారు ఆభరణాలను స్వాదీనం చేసుకు న్నట్లు తెలిపారు.నేరానికి వినియోగించిన కృపానందం పల్సర్ మోటార్ సైకిల్ని సీజ్ చేసి, వారిని రిమాండ్‌కి తరలించడం జరిగిందన్నారు. జగదీశ్‌పై 25కి పైగా దొంగతనం కేసులు ఉన్నాయి. ఇతనికి సహకరించిన కృపానందం, కర్నూలు రెండవ బెటాలియన్‌లో కానిస్టే బుల్‌గా పని చేస్తూ గత ఆగష్టులో కంభం పోలీస్ వారు అరెస్ట్ చేసి, గిద్దలూరు జైలులో ఉంచగా సస్పెన్షన్‌లో ఉన్నాడు.

ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రహదారుల్లో ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్స్ గా గుర్తించిన రహదారి ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా బ్యారికేడింగ్, రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డ్స్ లాంటి ఏర్పాట్లను త్వరితగతిన చేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బీ, నేషనల్ హై వే కర్నూలు, అనంతపురం, కడప ప్రాజెక్ట్ డైరెక్టర్లను ఆదేశించారు.అలాగే పోలీస్ శాఖ ప్రతిపాదించిన విధంగా ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, నేషనల్ హై వేస్‌కు సంబంధించిన రోడ్లలో 84 అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికా రులను ఆదేశించారు. డ్రైవర్‌ల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరుగకుండా అవగాహన కల్పించాలని ఆర్టీసీ, రవాణా శాఖల అధికారులను ఆదేశించారు. ఎల్లమ్మ దేవాలయం దగ్గర జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులను నెల లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను అక్టోబర్ 10వ తేదీ లోపు జనరల్ బాడీ సమావేశంలో ఆమోదం తీసుకుని ప్రభుత్వానికి పంపాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఆదోని మంత్రాలయం, ఆలూరు తదితర ప్రాంతాల్లో ఉన్న ఆర్ అండ్ బి రోడ్లలో రాత్రి పూట ప్రమాదాలు జరుగకుండా వెలుతురు ఇచ్చే రోడ్ స్టడ్స్ ను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ ఎస్ఈకి సూచించారు. నగరంలో ఇన్స్టాల్ చేసిన సీసీ కెమెరాల నిర్వహణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మరో 135 సీసీ కెమెరాలను త్వరితగతిన ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వర రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, టీడీపీ శాంత కుమారి, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్‌లు, పంచాయతీ రాజ్, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీవీ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర - గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో దసరా పండగ సందర్భంగా నిర్వహించిన, బీవీ మోహన్ రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు భాస్కర్, చంద్రశేఖర్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా పోటీల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గోనెగండ్ల మండలం మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఎమ్మిగనూరు నియోజక వర్గంలో మాజీ మంత్రి కీర్తీ శేషులు. బీవీ మెహన్ రెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ఆయన సేవలు గురించి కొని యాడారు. కీడ్రాకారుల నుంచి యువకులకు స్నేహ భావం, ఉల్లాసం ఉత్సాహం వస్తుందని తెలిపారు. యువత క్రీడల్లో రాణించాలనే ఆలోచనతోనే బీవీ కుటుంబం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు, పట్టణ కమిటీ నాయకులు, టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ కుంటుబ సభ్యులు, కీడ్రాకారులు పాల్గొన్నారు.

బన్నీ పండుగను ప్రశాంతంగా జరుపు కొండి

విశాలాంధ్ర - హొళగుంద: నేరనికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి బన్నీ పండుగను భక్తులు ,ప్రజలు ప్రశాంతంగా జరుపు కోవాలని ఎస్సై దిలీప్ కుమార్ కోరారు. నేరనికి తండాలో బుధవారం బన్నీ పండుగపై పోలీసు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై దిలీప్ కుమార్ మాట్లాడుతూ పండుగను ప్రశాంతంగా జరుపుకొని విజయవంతం చేయాలని పండుగల్లో ఎవరైనా అలజడి సృష్టించిన, ఘర్షణలు, తగాదాలకు దిగితే పోలీస్ శాఖ చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. సైబర్ నేరాలు గురించి జాగ్రత్తగా ఉండాలని కోరారు. రోడ్డు ప్రమాదలు రోడ్డు భద్రతల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ 1930 గురించి ప్రజలకు వివరించారు. పోలీస్ అవగాహన సదస్సులు సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు, పోలీసులు సుధాకర్, రాజగోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నాటు సారాను పూర్తిగా అరికట్టండి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జిల్లాలో నాటు సారాను పూర్తిగా నిర్మూలించే చర్యలు తీసుకోవాలని, సారా వల్ల జరిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించాలని నవోదయం సమావేశంలో అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధ్యక్షతన నాటు సారా నిర్మూలన కార్యక్రమం నవోదయం సమావేశం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు సమక్షంలో జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాటు సారాను పూర్తిగా నిర్మూలించాలని అధికారులను ఆదేశించారు. నాటు సారా తయారు చేసే వ్యక్తులను గుర్తించి వారికి దానివల్ల జరిగే దుష్పరిణామాలపై పూర్తి అవగాహన కల్పించి, వారిని ఆ వృత్తి నుండి బయటికి తీసుకుని రావాలని కోరారు. అంతకుముందు నవోదయం ఏర్పాటు గురించి జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ సుధీర్ బాబు సమావేశాన్ని ఉద్దేశించి వివరాలు తెలిపారు.

స్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని మేకడోన గ్రామంలో మైనారిటీలకు స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ గీతా ప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్ మాట్లాడుతూ మేకడోన గ్రామంలో దాదాపు 350 పైగా మైనారిటీ కుటుంబాలు ఉన్నాయన్నారు. స్మశాన వాటిక లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో సమీప ఇళ్ల దగ్గరే శవాలను పూడ్చుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు ఉసేన్ బాష పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడల్లో నంద్యాల కిరీటం పబ్బతి చిన్మయి శ్రేయ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఉత్తరాఖండ్‌లో ఇటీవల నిర్వహించిన అండర్-17 ఫెన్సింగ్ పోటీల్లో విశేష ప్రతిభను ప్రదర్శించి అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే అర్హత పొందిన నంద్యాల యువ క్రీడాకారిణి పబ్బతి చిన్మయి శ్రేయ రాయలసీమ ప్రాంతానికి గర్వకారణమని ఎపిపిఎస్ సి మాజీ చైర్మన్ డాక్టర్ నౌమాన్ కొనియాడారు. ప్రముఖ బిల్డర్ పబ్బతి వేణు కుమార్తె అయిన శ్రేయ తన పట్టుదల, కృషి, క్రీడపై తపనతో రాష్ట్ర స్థాయిలో మెరిసి, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అంతర్జాతీయ అండర్- 17 ఫెన్సింగ్ పోటీలకు రాయలసీమ నుంచి ప్రథమసారి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారిణిగా చిన్మయి శ్రేయ చరిత్రలో నిలిచారు. డాక్టర్ ఎస్ఎండీ నౌమాన్ ఆమెను ప్రత్యే కంగా అభినందిస్తూ పబ్బతి చిన్మయి శ్రేయ సాధించిన విజయంతో నంద్యాల ప్రతిష్ట మరింత పెరిగిందన్నారు. వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు తమీమ్, చంద్రశేఖర్ రెడ్డి, పార్థుడు అభినందించారు.

నాటు సారా తయారీ చేసే వ్యక్తిపై కేసు

విశాలాంధ్ర - హొళగుంద: హొళగుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేటలో బుధవారం ఎస్సై దిలీప్ కుమార్, పోలీస్ సిబ్బంది విస్తృత పోలీస్ దాడులు నిర్వహించారు. బోయ వెంకటేష్ నాటు సారా తయారు చేస్తూ తన పొలంలో పాతిపెట్టిన 15 లీటర్ల నాటు సారాను స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై దిలీప్ కుమార్ తెలిపారు. నాటు సారా తయారు చేసే వ్యక్తి బోయ వెంకటేషను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్, మధు డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి బృందం వ్యవసాయ మార్కెట్ యార్డు సూపర్ వైజర్ మహమ్మద్ అర్షద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు మధ్యాహ్న భోజనం సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ కు వచ్చే రైతులకు తాగునీటి సదుపాయం కోసం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్ యార్డులో పంట నిలువలు చేసుకునేందుకు స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగన్న, రాముడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రానికి అధికారిని నియమించండి

విశాలాంధ్ర -ఆలూరు: మండలం కురుకుంద గ్రామములో రైతు సేవా కేంద్ర అధికారి ఇటీవల కాలంలో బదిలీపై వెళ్లిపోవడంతో ఇప్పుడు వరకు అధికారులు నియమించలేదు. బుధవారం గ్రామ రైతులు మండల వ్యవసాయ అధికారిని కలిసి రైతు సేవ కేంద్రానికి అధికారి నియమించండని వినతి పత్రం ఇచ్చారు. అనంతరం రైతులు మాట్లాడుతూ రబ్బి సీజన్ ముగుస్తుంది. అదేవిధంగా ఈనెల ఆఖరికి పంట నమోదు కూడా ముగుస్తుందని వారు వాపోయారు. గ్రామంలో ప్రస్తుతం రైతు సేవాధికారి లేకపోవడంతో పంట నమోదు చేయకపోవడంతో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని వారికి తెలిపారు. దీంతో భవిష్యత్తులో రైతులకు సబ్సిడీలు, విత్తనాలు, ఇన్సూరెన్స్ వంటి ప్రయోజనాల నుంచి నష్టపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు వాల్మీకి శ్రీరాములు, పులికేశవరెడ్డి, ఎంపీటీసీ ఎస్సప్ప, దేవప్ప, గోవిందప్ప, ఉలిగప్ప పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై ఆరోపణలు తగదు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: టీడీపీ నాయకులపై ఆరోపణలు చేయడం తగదని సర్పంచ్, టీడీపీ నాయకులు లక్ష్మీశ్వరయ్య గౌడ్, నాయకులు శేఖర్ గౌడ్, మాధవ్ కిష్టయ్య, రంగడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో వారు పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈశ్వర్ స్వామి మన్యం టీడీపీ నాయకులు ఆక్రమించుకొని సొమ్ము చేసుకుంటున్నారని పత్రికల్లో వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమైనవని వారు ఖండించారు. సర్వేనెంబర్ 457లో 15 ఎకరాల 40 సెంట్లు భూమి ఉందన్నారు. గతంలో 6 ఎకరాలు దేవదాయ శాఖ వారు రెవిన్యూ శాఖకు విక్రయించిన విషయం వాస్తవం అన్నారు. మిగిలిన భూమి ఆర్ఎంబి రోడ్డుకు, గ్రామ సచివాలయాలకు తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించారన్నారు. మిగిలిన 2 ఎకరాలలో ప్లాట్లు వేసి టీడీపీ నాయకులు అమ్ముకుంటున్నారని వైసీపీ నాయకులు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. గ్రామ పెద్దల మేరకు రామలింగేశ్వర స్వామి పూజారులు జీవనోపాధి నిమిత్తమై పొలంలో ఉన్న రాళ్లు, గుట్టలు తొలగించి సదురు చేసుకుంటున్నారు. దేవాదాయ భూములలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబుకి, గ్రామ టీడీపీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదని, ఏదైనా నిజాలు తెలుసుకొని దేవాదాయ శాఖ వారికి ఫిర్యాదులు చేస్తే బాగుంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీరభద్రయ్య, హరిశంకర్, వెంకటేష్, రామాంజనేయులు, శ్రీనివాసులు గౌడ్, రామకృష్ణ, ఆకులగంగన్న తదితరులు పాల్గొన్నారు.

కాత్యాయిని దేవి అలంకారంలో వాసవి మాత

విశాలాంధ్ర-అవుకు: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా మూడవరోజు బుధవారం శ్రీ కాత్యాయనీ దేవి అలంకారంలో వాసవి మాత భక్తులకు దర్శనమిచ్చారు. కాత్యాయని దేవి అలంకారంలో ఉన్న వాసవి మాతకు చిలంకూరు సత్యనారాయణ వారి కుమారులు పూజ ఉభయ దారులుగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాత్యాయిని దేవి అలంకారంలో ఉన్న వాసవి మాతను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు,ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు తాల్లేపల్లి నాగేంద్ర, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు జూటూరు రాజ్యలక్ష్మి, తల్లం సుబ్బ నాగభూషణం, మల్లెల సూర్యనారాయణ,మల్లెల ఆంజనేయులు, బుగ్గరవు రామాంజనేయులు పాల్గొన్నారు.

మిరపలో సస్య రక్షణ

విశాలాంధ్ర - గోనెగండ్ల: మండల పరిది లోని పెద్దమర్రి వీడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ మాట్లాడుతూ మిరపపంటలో వైరస్ తెగులు నివారణకు కారణమయ్యే రసం పీల్చే పురుగుల నివారణకు ఎకరానికి 30 పసుపు, నీలి తెలుపు జిగురు అట్టలు పెట్టుకోవాలని తెలిపారు.

హోటల్ కె.ఫర్చున్ ప్రారంభం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లే జాతీయ రహదారిలో జి.పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ ఎదురుగా కొత్తగా ఏర్పాటు చేసిన హోటల్ కె.ఫర్చున్‌ను ముఖ్య అతిథి పార్లమెంట్ మాజీ సభ్యులు జేసీ దివాకర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన రెస్టారెంట్ ఏర్పాటు చేయడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే వారికి మంచి ఆహారంతో పాటు ఆహ్లాదాన్ని అందిస్తుందన్నారు. ఫ్యామిలీ కస్టమర్లకు అనుకూలంగా ఇక్కడ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారన్నారు. హోటల్ కె ఫర్చున్ చైర్మన్ కేశవరెడ్డి మాట్లాడుతూ తమ హోటల్ ఫర్చున్‌లో నాణ్యమైన ఆహారాన్ని కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా తయారుచేసి అందిస్తామన్నారు. మధ్యాహ్నం రాత్రి వేజ్, నాన్ వెజ్ వంటకాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు భరత్ విష్ణు రెడ్డి డాక్టర్ పద్మిని జై, మేనేజింగ్ డైరెక్టర్ అండ్ ఎగ్జిక్యూటివ్స్ భరత్ వంశి రెడ్డి, డాక్టర్ నాగ అపర్ణ, జనరల్ మేనేజర్ నాగూరు బాబు, నగర ప్రముఖులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణలో అమ్మవారు

విశాలాంధ్ర-గూడూరు: శరన్నవరాత్రి మహోత్స వంలో భాగంగా బుధవారం శ్రీ సుంకులా పరమేశ్వరి అమ్మ వారు శ్రీ అన్న పూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని కె.నాగలాపురంలో వెలసిన శ్రీ సుంకులా పరమే శ్వరి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో చేరుకొని శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి అభిషేకం కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుంకులాపరమేశ్వరి అమ్మవారికి తమిళనాడుకు చెందిన పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారి కేశవ పర్యవేక్షణలో పూజా కార్యక్రమంలో కొనసాగాయి.

పీ4 పాలసీపై శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు బుధవారం పరిపాలన విభాగపు అధికారి కౌసల్య, ఏఎస్ఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు రాజు, స్వామినాథ్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ4 పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో దారిద్ర్యరేఖకు దిగువన ఎన్ని కుటుంబాలు ఉన్నాయో ముందుగా సర్వే చేసుకోవాలని సూచించారు. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి మార్గదర్శకుల ద్వారా ఆయా కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి వారి మెరుగుదలకు పాటు పడడమే పీఎం 4 పథక ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఆయా సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డీలర్‌లతో సమావేశం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: మండలంలోని డీలర్లతో బుధవారం తహసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి సమావేశమయ్యారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కొత్తగా ఈ పాస్ మిషన్లు డీలర్లకు అందజేయడం జరిగిందనీ త్వరలో రేషన్ కార్డ్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు అందజేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. నిత్యవసర సరుకుల పంపిణీలో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా సరుకులను అందజేయాలని అధికారులు డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలసిన మార్కెట్ యార్డ్ చైర్మన్ హరిబాబు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ను నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరి బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీతో రాణి మహారాణి థియేటర్ దగ్గర జరుగు తున్న పొట్టేలు సంత మార్కెట్‌ను నూనెపల్లిలోని మార్కెట్ యార్డులోకి తరలించుటకు సహకరించ వలసిందిగా కోరారు. ప్రవేట్ వ్యక్తుల ఆధీనంలో జరుగుతున్న పొట్టేలు సంత వలన పలు గ్రామాలకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, మార్కెట్ యార్డు ఆదాయం పెంచుట కొరకు పొట్టేలు సంతను మార్కెట్ యార్డ్ తరలించడానికి సహకరించవలసిందిగా ఎస్పీని కోరారు. ఎస్పీ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. వైస్ చైర్మన్ డి. రంగ ప్రసాద్, అడ్వకేట్ హుస్సేన్ బాబు, డైరెక్టర్ స్వామి నాయక్ పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-పాణ్యం: రోటరీ క్లబ్ మిడ్ టౌన్ నంద్యాల వారు కబడ్డీ క్రీడా కారులకు, కోచ్ మేనేజర్లకు రూ.19 వేల క్రీడా దుస్తులను పంపిణీ చేయడం జరిగినది. జూనియర్ బాల బాలికలకు గొల్లపూడిలో రాష్ట్రస్థాయిలో జరుగుతున్న 26 జిల్లాల అంతర్ రాష్ట్ర కబడ్డీ పోటీలో భాగంగా బాలుర కబడ్డీ జట్టుకు గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారం రోజులు గడివేముల గ్రామస్తులు ఓల్డ్ కబడ్డీ క్రీడాకారుల ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి కల్పించారు. అదేవిధంగా బాలికల విభాగంలో పాణ్యం విజయానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ విజయకుమార్ రెడ్డి సారు ఉచిత వసతి భోజనం కల్పించారు. క్రీడాకారులకు క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ కేశవమూర్తి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, నంద్యాల జిల్లా కబడి అసోసియేషన్ ప్రెసిడెంట్ చింతల మోహన్ రావు, విజయానికేతన్ కరస్పాండెంట్ విజయకుమార్ రెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు సుబ్బయ్య, శేషఫణి, మన్యం శ్రీనివాసరెడ్డి, మాబాష పాల్గొన్నారు. కబడ్డీ శిక్షణ శిబిరాలు నంద్యాల జిల్లా కబడి అసోసియేషన్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ పాణ్యం, ఫిజికల్ డైరెక్టర్లు ఇప్ప వెంకటేశ్వర్లు, భుజంగరావు, రామేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, బాష, రమణ, రేవతి పర్యవేక్షణలో కబడ్డీ క్రీడాకారులకు శిక్షణ కార్యక్రమం ఈరోజు ప్రశాంతంగా ముగిసినది.

సేవా పర్వ్‌తో పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: సేవా పర్వ్ కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పీఎస్ షా వలీ ఖాన్ అన్నారు. స్థానిక డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ చేపట్టిన సేవా పర్వ్ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇంచార్జి వైస్ ఛాన్సులర్ ప్రొఫెసర్ పీఎస్ షా వలీ ఖాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వారు ప్రజా సేవ, సమాజ భాగస్వామ్యం మరియు సమ్మిళిత పాలన స్ఫూర్తికి అనుగుణంగా ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు సేవా పర్వ్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. వాయు కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనే సేవా పర్వ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహబూబ్ బాష, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సి.హెచ్.పాల్ కృపాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎస్ఎం హుస్సేని, బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, సేవా పర్వ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వన్య ప్రాణులకు హానితలపెడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర - రుద్రవరం : అటవీ వన్యప్రాణులకు హాని తల పెడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రుద్రవరం రేంజర్ మూర్తు జావలి తెలిపారు. బుధవారం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో సంచరిస్తూ గ్రామాలకు సమీపంలో ఉండే పంట పొలాల్లోకి ఉన్నప్రాణులు వస్తున్నాయంటూ ఎవరైనా వణ్య ప్రాణులను వేటాడేందుకు ఉచ్చులు, కరెంటు పెట్టి వణ్య ప్రానులకి హాని తలపెడితె అలాంటి వారిపై అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటవీ, వణ్యప్రాణి సంరక్షణకు సంబందించి క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అటవీ సంరక్షణలో సిబ్బంది నిర్లక్ష్యం వీడాలన్నారు. సమావేశంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు శ్రీనివాసరెడ్డి, మక్తర్ భాష, రామకృష్ణ, మాబు ఖాన్, బీట్ ఆఫీసర్లు జేమ్స్ పాల్, నరసింహారెడ్డి, నాగ హుస్సేనయ్య, సురేంద్ర గౌడ్, సుభాష్, మదన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గురురాజా ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధ్యాపక బృందానికి గత రెండు రోజులుగా శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గురు రాజా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు విజయ వంతంగా ముగిసాయి. బహుమతి ప్రధానోత్సవానికి నంద్యాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌలాలి రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొని విజేత జట్టుకు, రన్నర్స్ జట్టుకు, వ్యక్తిగత ప్రతిభ చూపిన క్రీడాకారులకు ట్రోఫీలు, జట్టు సభ్యులకు పతకాలు అందజేసి అభినందించారు. భవిష్యత్తులో ఉపాధ్యాయుల కోసం సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు నిర్వహి స్తామని శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు మనోహర్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర -ఆలూరు: శ్రీ మాళ మల్లేశ్వర స్వామి ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని, బుధవారం మండలంలోని అరికేర, అరికేర తాండా గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శోభ సువర్ణమ్మ మాట్లాడారు. ఉత్సవాలను శాంతియుతంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు ఇచ్చారు. సీఐ రవి శంకర్ మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం సేవించి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోద్ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇంచార్జీ ఎంపీడీవో, ఆర్ఐ బసవన్న గౌడ్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీబీవో అకౌంటింగ్‌పై టీవోటీ శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర-పాణ్యం: మండల కేంద్రంలో పొదుపు కార్యాలయంలో మండలం సీఎం టీసీ సెంటర్ నందు 14మండలాల సిబ్బందికీ సీబీవో అకౌంటింగ్ పైన బుధవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి డీఆర్డీయే జిల్లా పథక సంచాలకులు వైబీ శ్రీధర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ గ్రామ సంఘాలకు సంబంధించినటువంటి అన్ని రకాల ఆర్థిక లావాదేవీలను ప్రతినెల తప్పకుండా ఆన్లైన్ సిబిఐ అకౌంటింగ్ నందు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మన డబ్బులు, మన లెక్కలు కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కల్పిం చడం జరిగిందన్నారు. సంఘాల్లో ఉన్న ప్రతి మహిళ తీసుకున్న అప్పులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు పూర్తి పారదర్శకతతో ఉండాలని అటువంటి ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింద న్నారు. గ్రామస్థాయిలో ఉన్నటువంటి సిబ్బంది అందరూ కార్యక్రమాన్ని సభ్యులందరి సహకారం తో పూర్తి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జిల్లా డీపీఎం ఐబీ హనుమంత నాయక్, నంద్యాల ఏరియా కోఆర్డినేటర్ ఏఎస్ ప్రసాద్, ఐబీ ఏపీఎం పుణ్యవతి, సిబ్బంది హాజరయ్యారు.